

సాక్షి
సూర్యాపేట
గురువారం : 15 : జూన్ : 2023



మూసీకి ఇన్‌ఫ్లో
మూసీకి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీంతో అధికారులు ప్రాజెక్టు ఒక క్రస్టు గేటును పైకెత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. - 4లో



ఖిలా.. దశ తిరిగేలా
భువనగిరి ఖిలాను అభివృద్ధి చేసేందుకు కేంద్రం స్వదేశీదర్శన్‌-2 లో భాగంగా రూ.100 కోట్లు కేటాయించింది. - 4లో

గరిష్టం/కనిష్టం
42°/31°

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎక్కువ వెచ్చగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురుస్తాయి.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేట : జిల్లాలోని 108లో ఈఎంటీగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఈఎంఈ సోమేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ (బీజెడ్సీ), బీఎస్సీ (నర్సింగ్), జీఎన్ఎం, ఏఎన్ఎం, బీఫార్మసీ, డీ ఫార్మా, డీఎంఎల్‌టీ చేసి 30 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారు ఈ నెల 16న జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డ ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి 3 గంటల వరకు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు 9666307108, 9963560503 నంబర్‌లను సంప్రదించాలని సూచించారు.

పండుగ వాతావరణం కనిపించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామాల్లో చేపట్టే గిరిజన ఉత్సవం, పల్లె ప్రగతి దినోత్సవం, హరితహారం, మంచినీళ్ల పండుగ వంటి కార్యక్రమాలతో గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్‌తో కలిసి దశాబ్ది ఉత్సవాలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగీరథ పథకంపై అవగాహన కల్పించాలన్నారు. పల్లె ప్రగతి కార్యక్రమంలో రంగవల్లులు, మామిడి తోరణాలు, ముగ్గులతో అలంకరించాలని తెలిపారు. గిరిజనులకు సాధించిన ప్రగతిని తెలియజేయాలన్నారు. నూతనంగా ఏర్పడిన గిరిజన గ్రామాల్లో సభలు నిర్వహించాలన్నారు. తెలంగాణ హరితోత్సవం అటవీశాఖ అధికారులు చేపట్టాలన్నారు. తెలంగాణ విద్యా దినోత్సవం రోజున మన ఊరు మనబడి పాఠశాలలను ప్రారంభించడానికి సిద్ధం చేయాలని విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, పాటల పోటీలు నిర్వహించాలన్నారు. తెలంగాణ ఆధ్యాత్మిక దినోత్సవం రోజున దేవాలయాలు మసీదులు చర్చిల్లో కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. జూన్ 22 న అమరుల సంస్మరణ రోజున గ్రామాలు, పట్టణాలు, విద్యాలయాల్లో అమరులకు శ్రద్ధాంజలి ఘటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ కిరణ్‌కుమార్, జెడ్పీసీఈఓ సురేష్ కుమార్, డీపీఓ యాదయ్య, డీటీడీఓ శంకర్, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, సీపీఓ వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ అధికారులు పాపారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


పోలీస్ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన షురూ



ధృవపత్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ

సూర్యాపేటక్రైం : ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు తుది రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువీకరణ ప్రతాల పరిశీలన జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ప్రారంభమైంది. ఈ ప్రక్రియను ఎస్పీ రాజేంద్రప్రసాద్ పరిశీలించి మాట్లాడారు. మొదటి రోజు 600 మంది అభ్యర్థులకు 507 మంది హాజరయ్యారన్నారు. ఎస్పీ వెంట ఏఓ సురేష్‌బాబు, డీఎస్పీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ నర్సింహా, శ్రీనివాసరావు, గోవిందరావు, శ్రీనివాస్, నర్సింహారావు, సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీకాంత్, రాజ్ కుమార్ ఉన్నారు.

నీట్‌లో సిరి ప్రియకు ఓబీసీ కేటగిరీలో 3,014 ర్యాంక్



సూర్యాపేట టౌన్ : నీట్ ఫలితాలలో సూర్యాపేట పట్టణానికి చెందిన గొల్లపల్లి స్వామి, లక్ష్మిల కుమార్తె గొల్లపల్లి సిరిప్రియ 646 మార్కులతో జాతీయ స్థాయిలో ఓపెన్ కేటగిరీలో 8,156వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 3014వ ర్యాంకు సాధించింది . పదవ తరగతి వరకు పట్టణంలోని ఎమ్మెస్సార్ సెంట్రల్ స్కూల్‌లో చదివింది. ఇంటర్ హైదరాబాద్‌లోని శ్రీ చైతన్యలో చదివింది. ఇంటర్‌లో 979 మార్కులు సాధించింది. ఎంసెట్‌లో రాష్ట్ర స్థాయిలో 228 ర్యాంకు సాధించి ప్రతిభ కనబర్చింది. డాక్టర్ కావాలన్న లక్ష్యంతో కష్టపడి చదివినట్లు సిరిప్రియ తెలిపారు. దీనికి అమ్మానాన్నల ప్రోత్సాహం లభించిందన్నారు. ఉపాధ్యాయుల నుంచి సహకారం అందిందన్నారు. మంగళగిరిలోని ఎయిమ్స్‌లో గానీ , గాంధీ మెడికల్ కళాశాలలో గానీ సీటు వచ్చే అవకాశం ఉందన్నారు.

గడువు దాటితే వడ్డింపే..

మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను వసూళ్లకు డిమాండ్ నోటీసులు

- పన్ను చెల్లింపునకు రెండు అర్ధవార్షికాలుగా విభజన
- నిర్దేశించిన తేదీ దాటితే ప్రతినెలా 2శాతం వడ్డీ వసూలు
- ఆందోళన చెందుతున్న ఇళ్ల యజమానులు



హుజూర్‌నగర్ పట్టణం

హుజూర్‌నగర్: మున్సిపాలిటీల్లో గడువులోగా ఆస్తి పన్ను చెల్లించేలా యంత్రాంగం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ఈ ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను వసూళ్లకు అధికారులు ముందుగా భవనాల యజమానులకు డిమాండ్ నోటీసులు జారీ చేసే ప్రక్రియను ప్రారంభించారు. ఆర్థిక సంవత్సరాన్ని రెండు సమభాగాలుగా విభజించి మొదటి అర్ధవార్షికం జూన్ నెలాఖరు వరకు, రెండో అర్ధవార్షికాన్ని డిసెంబర్ నెలలాఖరు వరకు పరిగణనలోకి తీసుకుంటున్నారు. నిర్దేశించిన గడువులోగా ఆస్తిపన్ను వసూలు చేసేందుకు ప్రణాళిక రూపొందించుకున్నారు. ఒక వేళ చెల్లించకుంటే ప్రతినెలా 2శాతం వడ్డీ భారం పడనుంది.

ఇంటింటికీ నోటీసులు పంపిణీ..

ఆస్తిపన్నులు ముందస్తుగా చెల్లించేలా మున్సిపల్ అధికారులు ఈసారి ఇంటి యజమానులకు కంప్యూటర్ ద్వారా తీసిన డిమాండ్ నోటీసులు పంపిణీ చేస్తున్నారు. ఇది నిబంధన కాకపోయినప్పటికీ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సలహా మేరకు పన్ను వివరాలను యజమానులకు తెలియజేయడానికి సిబ్బంది మున్సిపల్ వార్డుల్లో కంప్యూటర్ నోటీసులు అందిస్తున్నారు.

వచ్చే నెల నుంచి అదనంగా 2 శాతం వడ్డీ..

ఆస్తిపన్ను చెల్లించేందుకు ప్రథమ అర్ధవార్షిక సంవత్సరం ఈ నెలతో ముగియనుంది. ఈ నెలలో ఆస్తి పన్ను చెల్లిస్తే సరి. లేదంటే ఇళ్ల యజమానులకు వడ్డీ భారం పడనుంది. వచ్చే నెల నుంచి చెల్లింపుదారుల నుంచి అదనంగా రెండు శాతం వడ్డీ వసూలు చేస్తారు. ఇలా ప్రతినెలా వడ్డీ పెరుగుతుంది. యజమానులకు ఇంటి పన్నుకు సంబంధించిన నోటీసులు అందినా.. అందకపోయినా ఇంటి నంబర్, అసెస్‌మెంట్ ఆధారంగా మున్సిపల్ కార్యాలయంలోగానీ బిల్ కలెక్టర్ల వద్ద గానీ లేదంటే ఆన్‌లైన్‌లో పన్ను చెల్లించవచ్చు.

ఈ నెల 30లోగా అయితే..

ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నెలలో ప్రారంభం కాగా ఆస్తిపన్ను చెల్లింపులపై పురపాలక శాఖ 5 శాతం రాయితీ అవకాశాన్ని కల్పించింది. ముందస్తుగా ఆస్తిపన్ను చెల్లించే వారికి ఉన్నతాధికారులు వెసులుబాటు ఇవ్వడంతో పలువురు చెల్లింపుదారులు ఆసక్తి కనబరిచారు. దీంతో కొంత మొత్తం ప్రభుత్వ ఖజానాకు జమ అయింది. ముందస్తుగా ఆస్తిపన్ను చెల్లింపులు చేసిన వారు మినహాయిస్తే మిగిలిన వారంతా గడువులోగా పన్ను చెల్లించకపోతే వడ్డీ భారం మోయాల్సి ఉంటుంది. ఈ నెల 30లోగా పన్ను చెల్లిస్తే ఎటువంటి భారం పడదు.

సెలవు దినాల్లోనూ అందుబాటులో..

ఆస్తిపన్ను చెల్లింపుల్లో రూ.2 వేల నోట్లను కూడా అధికారులు స్వీకరిస్తారు. ఎవరైనా ఆస్తి పన్నుగా రూ.2 వేల నోట్లను కూడా గడువులోగా చెల్లించి రశీదులు పొందవచ్చని మున్సిపల్ రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఆదివారం ఇతర సెలవు దినాల్లోనూ మున్సిపల్ బిల్ కలెక్టర్లు అందుబాటులో ఉండనున్నారు.

మున్సిపాలిటీల్లో వసూలు చేసిన పన్నుల వివరాలు..(రూ.లలో)

మున్సిపాలిటీ	వార్డులు	భవనాలు	పన్ను లక్ష్యం	వసూలుచేసింది	చేయాల్సింది
సూర్యాపేట	48	33,444	14.81కోట్లు	5.00కోట్లు	9.81కోట్లు
కోదాడ	35	16,326	6.49కోట్లు	1.86కోట్లు	4.63కోట్లు
హుజూర్‌నగర్	28	7,763	2.00కోట్లు	53.17లక్షలు	1.46కోట్లు
తిరుమలగిరి	15	5,209	1.33కోట్లు	36.15లక్షలు	97.23లక్షలు
నేరేడుచర్ల	15	4,262	98.23లక్షలు	21.30లక్షలు	76.93లక్షలు

ఈ నెలాఖరులోగా చెల్లిస్తే వడ్డీ ఉండదు



ఆస్తిపన్ను చెల్లింపుదారులకు ఈ నెలలో డిమాండ్ నోటీసులు అందజేస్తాం. ప్రభుత్వం ఇచ్చిన గడువు (ఈనెలాఖరు)లోగా ఆస్తి పన్ను చెల్లించిన వారికి వడ్డీ భారం ఉండదు. ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని భవన యజమానులు సద్వినియోగం చేసుకోవాలి.
– నిలిగొండ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్, హుజూర్‌నగర్

విద్యార్థులకు రాగిజావ



చిలుకూరులో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు (ఫైల్)

- ప్రభుత్వ పాఠశాలల్లో పంపిణీకి అధికారుల కసరత్తు
- దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 20న విద్యాదినోత్సవం రోజే ప్రారంభం
- 63 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం

చిలుకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చాలా వరకు నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులుండడంతో వారికి నాణ్యమైన మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉదయం పాఠశాలకు చాలా మంది అర్ధాకలితో వస్తున్నట్లుగా గుర్తించి వారికి అల్పాహారం కింద ఉదయం విరామ సమయంలో రాగిజావ అందించేందుకు కసరత్తు చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు ఎక్కువ మంది అల్పాహారం తీసుకోకపోవడంతో తరగతి గదుల్లో నీరసించి పోతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు రాగిజావ ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పించింది. ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయానికి తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు వేదికగా మారాయి. ఈ మేరకు విద్యార్థులకు సరిపడా బెల్లం పొడర్‌ను రాగిజావలో కలిపి పంపిణీ చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని జిల్లా విద్యాధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు అధికారులు విద్యార్థుల సంఖ్యను బట్టి ఎంత మేర బెల్లం పొడర్, రాగిజావ కావాలనే విషయమై ఓ నిర్ణయానికి వచ్చారు.

ఈ నెల 20 నుంచి అల్పాహారం..

ఈ నెల 20వ విద్యా దినోత్సవం సందర్భంగా అల్పాహారాన్ని అన్ని పాఠశాలల్లో ప్రారంభించేందుకు సంబంధిత అధికారులు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ పాఠశాలలు 941 ఉండగా వాటిల్లో 63,805 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ విద్యార్థులకు బెల్లం పొడర్‌తో కూడిన రాగిజావ అందించనున్నారు. మన ఊరు– మన బడి పథకం కింద పనులు పూర్తయిన పాఠశాలల్లో విద్యాదినోత్సవం రోజే గ్రంథాలయాలు, డిజిటల్ తరగతులు ప్రారంభిస్తారు.

ప్రభుత్వ నిబంధనల మేరకు మెనూ అమలు



విద్యార్థుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వం నూతనంగా రాగిజావను ఇవ్వాలని సంకల్పించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులకు మెనూ అమలు చేస్తాం. ఇప్పటికే మండల విద్యాధికారులకు ఈ విషయం తెలియజేశాం.
– అశోక్, జిల్లా విద్యాధికారి, సూర్యాపేట

మట్టపల్లిలో గరుడవాహన సేవ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని బుధవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా గరుడవాహన సేవ చేపట్టారు. ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యఅగ్నిహోత్రి, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర నామార్చన, కుంకుమార్చనలు గావించారు. అదే విధంగా నూతన పట్టు వస్త్రాలతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదాన్ని రక్తిగట్టించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షా బంధనం, రుత్విగ్వరణం, పంచగవ్య ప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేదమంత్రోచ్ఛరణలతో కల్యాణతంతు ముగించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్ కుమార్, ఈఓ నవీన్, అర్చకులు తూమాటి రామాచార్యులు. పద్మనాభాచార్యులు, లక్ష్మీ నరసింహామూర్తి, ఆంజనేయాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్ష నాయకుల ఆందోళన

- రాయినిగూడెం పీఏసీఎస్‌లో చోరీ కేసులో అధికారులు, పాలకవర్గం తీరుపై నిరసన
- కోదాడ– జడ్చర్ల రహదారిపై రాస్తారోకో
- ఎట్టకేలకు సీఈఓ, క్యాషియర్ సస్పెన్షన్



కీతవారిగూడెం వద్ద జడ్చర్ల-కోదాడ రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న అఖిలపక్ష నాయకులు

గరిడేపల్లి: గరిడేపల్లి మండల కీతవారిగూడెం గ్రామంలోని రాయినిగూడెం పీఏసీఎస్‌లో దొంగతనం జరిగిన 15 రోజులు అవుతున్నా అధికారులు, పాలక మండలి స్పందించకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో స్థానిక కోదాడ– జడ్చర్ల ప్రధాన రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా అఖిల పక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ రాయినిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో దొంగతనం జరిగి 15 రోజులవుతున్నా ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పాలకవర్గం, సీఈఓ నిర్లక్ష్యం కారణంగానే చోరీ జరిగిందని ఆరోపించారు. కార్యాలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న గరిడేపల్లి ఎస్ఐ వెంకట్‌రెడ్డి సంఘటన స్థలం వద్దకు వెళ్లి అఖిలపక్ష నాయకులకు నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె చాంద్‌పాషా, మండల పార్టీ అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, ఎంపీటీసీ బి. సందీప్, సీపీఎం నాయకులు తుమ్మల సైదయ్య, వీరరాఘవులు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్, రాజు, లూకాస్, కామళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీఈఓ, క్యాషియర్ సస్పెన్షన్

రాయినిగూడెం ప్రాథమిక సహకార సంఘం సీఈఓ, క్యాషియర్‌లను సస్పెండ్ చేస్తూ బుధవారం నిర్వహించిన పాలక మండలి అత్యవసర సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని ఏకగ్రీవంగా ఆమోదించినట్లు సంఘం చైర్మన్ ముప్పారపు రామయ్య ప్రకటించారు. ఆయన మాట్లాడారు. ఇటీవల పీఏసీఎస్‌లోని క్యాష్ కౌంటర్లలో జరిగిన దొంగతనానికి బాధ్యులుగా చేస్తూ క్యాషియర్ బాదే గోపాలకృష్ణ, సెక్రటరీ కాట్రిపుల లక్ష్మయ్యలను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. క్యాషియర్ వద్ద నుంచి దొంగతనానికి గురి అయిన సొమ్మును రికవరీ చేసినట్లు చెప్పారు. కౌంటర్లలోని క్యాష్‌ను లాకర్‌లో భద్రపరచకుండా క్యాషియర్ నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. సీఈఓ, క్యాషియర్‌లను సస్పెండ్ చేయడంతో తాత్కాలిక సంఘం కార్యదర్శిగా నిడిగొండ కనకయ్యను, క్యాషియర్‌గా పాలెల్లి అంజయ్యలను నియమిస్తూ తీర్మానించినట్లు తెలిపారు.

ప్రజారోగ్యంలో విప్లవాత్మక మార్పులు



ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గర్భిణులకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను అందజేస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి

- మెడికల్ కళాశాలల ఏర్పాటు సంచలనాత్మకం
- ప్రజల చెంతకు కార్పొరేట్ వైద్యం
- విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి
- సూర్యాపేట మెడికల్ కళాశాల ప్రాంగణంలో వైద్య ఆరోగ్య దినోత్సవం

సూర్యాపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యంలో విప్లవాత్మక మైన మార్పులు తీసుకొచ్చిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం సూర్యాపేట మెడికల్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఆరోగ్య దినోత్సవంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజల చెంతకు కార్పొరేట్ వైద్యం చేరిందన్నారు. మెడికల్ కళాశాలల ఏర్పాటు వైద్య రంగంలో సంచలనం సృష్టించాయన్నారు. రాష్ట్రంలో 60 ఏళ్లలో మూడు మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తే 9 ఏళ్లలో 21 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసిన రికార్డ్ సీఎం కేసీఆర్‌కు సొంతం అని ఆయన కొనియాడారు. సూర్యాపేటలోని ఆస్పత్రిలో 2014కు పూర్వం 100 పడకలు ఉండగా మెడికల్ కళాశాల ఏర్పాటుతో అవి 450కి పెరిగాయన్నారు. అప్పుడు ఐసీయూ అంటేనే అర్థం తెలియని ప్రజలకు ఇప్పుడు ఏకంగా 50 పడకలు ఏర్పాటైనట్లు వివరించారు. 2014కు పూర్వం 95 జనరల్ బెడ్స్ ఉండగా ఇప్పుడు 350కి చేరడం వైద్యరంగంలో మార్పుకు సూచి అని చెప్పారు. రాష్ట్రం ఏర్పడ్డాక తొమ్మిదేళ్లలో వైద్య రంగం కొత్త పుంతలు తొక్కిందనడానికి కేసీఆర్ కిట్, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్, ఆరోగ్య మహిళా పథకంలో 57 రకాల పరీక్షలు, బీపీ, షుగర్ కిట్లు, పల్లె దవాఖానా, బస్తి దవాఖానాలు, వయో వృద్ధుల ఆశ్రమాల ఏర్పాటు దర్పణం పడుతుండగా బోదకాలు సోకిన వారికి పింఛన్ పథకం ప్రవేశ పెట్టడం నిలువెత్తు నిదర్శనాలు అని అన్నారు. తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్‌ను సూర్యాపేటలో ప్రారంభించుకోవడం ముదావహమన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ కిశోర్, జెడ్పీ వైస్ చైర్మన్ వెంకట నారాయణగౌడ్, జెడ్పీటీసీలు భిక్షం, అనిత, ఎంపీపీ రవీందర్ రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ హర్షవర్ధన్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శారద, సూపరింటెండెంట్ మురళీధర్ రెడ్డి పాల్గొన్నారు.



వైద్య ఆరోగ్యశాఖ ముద్రించిన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి, కలెక్టర్, ఎంపీ, తదితరులు

పిల్లలమర్రి ఆలయాల్లో జిల్లా జడ్జి పూజలు



జిల్లా జడ్జి రాజగోపాల్ దంపతులను సన్మానిస్తున్న దేవాలయ కమిటీ

సూర్యాపేట రూరల్ : మున్సిపల్ పరిధిలోని పిల్లలమర్రి ఆలయాల్లో జిల్లా జడ్జి రాజగోపాల్ దంపతులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎరకేశ్వర స్వామి, నామేశ్వర స్వామి, శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయాలను సందర్శించారు. ఆలయాల చరిత్రను అడిగి తెలుసుకున్నారు. అర్చకులు దేవాలయ చిత్రపటాన్ని అందించి సన్మానించి ఆశీర్వచనం చేశారు. ముందుగా శివాలయ కమిటీ చైర్మన్ జెర్రిపోతుల భిక్షం, చెన్నకేశవస్వామి దేవాలయ కమిటీ సభ్యులు రాపర్తి మహేష్‌లు పుష్పగుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ముడుంబై రఘువరన్ ఆచార్యులు, సంతోష్ శర్మ పాల్గొన్నారు.




ఖిలాపై నిర్మించిన మహల్



ఖిలాపైకి మెట్ల మార్గం

కళ్యాణ చాళుక్యుల నుంచి స్వదేశీ దర్శన్‌కు..

ఖిలా.. దశ తిరిగేలా

క్రీ.శ.1100 ముందు నుంచే రాజుల ఏలుబడిలో భువనగిరి కోట

- పర్వతారోహణకు కేంద్రంగా..
- ఎవరెస్ట్, కిలిమంజారో, మౌంట్ ఎల్‌బ్రోస్ పర్వతాలను అధిరోహించిన ఇక్కడి శిక్షకులు
- పర్యాటకంగానూ ప్రసిద్ధి
- ఖిలా అభివృద్ధికి రూ.100 కోట్లు
- స్వదేశీ దర్శన్ –2 కింద కేటాయించిన కేంద్ర ప్రభుత్వం
- రోప్ వే, మ్యూజియం, రెస్టారెంట్లు, లేజర్ షో వంటివి ఏర్పాటు


భువనగిరి కోట

కళ్యాణీ చాళుక్య చక్రవర్తి త్రిభువనమల్లుడి నుంచి నిజాం నవాబుల వరకు ఎన్నో చారిత్రక అంశాలకు నిలువెత్తు సాక్షి భువనగిరి ఖిలా. రాజుల కాలం ముగిసిన తర్వాత పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది. ఏకశిలతో నిర్మితమైన ఈ కోటను నిత్యం వందలాది మంది సందర్శిస్తుంటారు. అంతే కాదు.. అడ్వెంచర్ కేంద్రంగా యువతీయువకులు రాక్ క్లైంబింగ్, ర్యాప్లింగ్ శిక్షణ పొందుతున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన పలువురు ఎవరెస్టు, కిలిమంజారో, మౌంట్ ఎలబ్రోస్ వంటి ఎత్తయిన పర్వతాలను అధిరోహించి దేశ కీర్తిని ప్రపంచ నలుదిశలా చాటారు. పర్యాటలకు మరింతగా ఆకర్షించేందుకు కేంద్ర ప్రభుత్వ స్వదేశీ దర్శన్–2కింద రూ.100 కోట్లు కేటాయించింది. –సాక్షి నల్లగొండ డెస్క్


రాక్ క్లైంబింగ్ చేస్తున్న యువతి


కోటపై ఫిరంగి

చారిత్రక నేపథ్యం కలిగిన భువనగిరి ఖిలా(కోట) ఆధునిక కాలంలో పర్యాటక కేంద్రంగా, రాక్ క్లైంబింగ్, ర్యాప్లింగ్ శిక్షణకు కేరాఫ్‌గా మారింది. ఇక్కడ పర్యాటకశాఖ సహకారంతో నిర్వహిస్తున్న రాక్ క్లైంబింగ్ కోచింగ్ స్కూల్ ద్వారా వేలాది మంది పర్వతారోహణకు ఓనమాలు దిద్దారు. నానాటికీ పెరుగుతున్న పర్యాటకులను ఆకర్షించేందుకు ఇప్పటికే కోటపైకి ఉన్న మెట్ల మార్గాన్ని అభివృద్ధి చేశారు. రోప్‌వే నిర్మాణం ప్రతిపాదనలో ఉంది. వీటితో పాటు కోటపైన మౌలిక వసతులు కల్పించడానికి ప్రతిపాదనలు తయారు చేశారు. శని, ఆదివారాలు, ప్రత్యేక రోజుల్లో ఖిలాపైకి పర్యాటకులు పెద్ద ఎత్తున వస్తున్నారు. వీరి కోసం పర్యాటక శాఖ ప్రత్యేకంగా గైడ్‌ను ఏర్పాటు చేసింది.


ఖిలాపై బురుజు

ఖిలా చరిత్ర ఇదీ..

చరిత్రలో తెలంగాణను ఏలిన అందరి ఏలుబడిలో భువనగిరి ప్రాంతం వుంది. మూసీ నది ప్రాంతాన్ని జయించిన మహాపద్మనందులు, ఆ తర్వాత మౌర్యులు, పిదప మహిషకుడు ఖారవేలుడి ఏలుబడిలో వుండి వుంటుంది భువనగిరి. శాతవాహనుల నుంచి ఆసఫ్జాహీల దాకా వివిధ రాజుల రాజ్యాల్లో భువనగిరి భాగమై వుంది. శాసనాల దాఖలా ప్రకారం క్రీ.శ.1100కు ముందునుండే భువనగిరి దుర్గం కళ్యాణ చాళుక్యుల పాలనలో వుంది. అప్పుడిది కొలనుపాకకు రక్షణ, ప్రధానంగా సైనిక దుర్గంగా ఉన్నట్లు చరిత్ర చెబుతుంది.

బోనయ్య, గిరమ్మల పేరున నిర్మించిందే భువనగిరి కోట


జానపదుల పేరు మీద ఏర్పడ్డదే భునగిరి ఖిలా. అప్పట్లో ఒక రాజు ఇప్పటి రాయగిరి రైల్వేస్టేషన్ (ఒకప్పటి తిరుమలగిరి తండా) దగ్గర మల్లన్నగుట్ట మీద కోట కట్టబోతుంటే బోనయ్య అనే గొల్లాయన ఈడ కోటేం కడ్తరుగని మీకు మంచి జాగ జూపిస్త రమ్మని తీసుకపోయి బోనగిరి గుట్టను చూపెట్టిండంట. దాని మీది కప్పి వున్న తీగెలపాద మొదలు హనుమాపురం వరకు ఉండెనట. దాన్నినరికి రాజుకు గుట్ట చూపెడితే రాజు రాయిగిరిలో కోట కట్టుడాపి బోనగిరిగుట్ట మీద ఖిల్లా నిర్మించిండట. రాజు ఇనామిస్తనంటే బోనయ్య తన పేరు, తన భార్యపేరు గిరమ్మ కలిసొచ్చేటట్లు ఊరు కట్టియ్యమన్నడంట. దీంతో రాజు తథాస్తన్నడు. బోనయ్య, గిరమ్మల పేరుమీద 'బోనగిరి'ని కట్టించిండు రాజు. ఆ బోనగిరే ఇప్పుడు భువనగిరిగా పిలువబడుతున్నది.

రాక్ క్లైంబింగ్, ర్యాప్లింగ్‌లో శిక్షణ

రాక్ క్లైంబింగ్, ర్యాప్లింగ్ సాహసికులకు భువనగిరి కోట వేదికగా మారింది. హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి శిక్షణ పొందడానికి పెద్ద ఎత్తున వస్తుంటారు. శిక్షణ ఇవ్వడానికి నలుగురు కోచ్‌లు ఉన్నారు. జూలై నుంచి ఫిబ్రవరి వరకు ఇక్కడ శిక్షణ ఇస్తారు.

మాలోతు పూర్ణా, ఆనంద్ ఇక్కడే కోచింగ్

సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలల విద్యార్థులు మాలోతు పూర్ణా, ఆనంద్ భువనగిరి ఖిలా వద్దనే ప్రాథమిక శిక్షణ పొందారు. పూర్ణా అతి చిన్న వయసులో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి రికార్డు సృష్టించారు. ఈమెతో పాటు ఇక్కడ శిక్షణ పొందిన సుమారు 90 మంది ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అలాగే కిలిమంజారో పర్వతాన్ని 300 మంది. మౌంట్ ఎలబ్రోస్ పర్వతాన్ని 100 మంది వరకు అధిరోహించారు. ప్రపంచంలోని ఏడు ఖండాల్లో ఉన్న ఎత్తయిన పర్వతాలను అధిరోహించడానికి ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. సాఫ్ట్‌వేర్ రంగం, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు సుమారు 10,000 మంది ఇక్కడ రాక్ క్లైంబింగ్, ర్యాప్లింగ్‌లో సర్టిఫికెట్ కోర్సులు పూర్తి చేశారు.


ఖిలాపై నీటితో కళకళలాడుతున్న కొలను

రూ.100 కోట్లతో చేపట్టనున్న పనులు

భువనగిరి ఖిలాను అభివృద్ధి చేయడానికి కేంద్రం స్వదేశీ దర్శన్–2లో భాగంగా రూ.100 కోట్లు కేటా యించింది. భువనగిరి ఖిలాపైకి రోప్ వే నిర్మాణం ద్వారా పర్యాటకులను ఆకర్షించాలన్నది కేంద్ర ప్రభుత్వ సంకల్పం. వరంగల్, యాదాద్రి, కొలనుపాకకు వచ్చిపోయే వేలాది మందిని ఇక్కడికి ఆహ్వానించే కార్యక్రమం చేపడుతున్నారు. అలాగే ఖిలాపై పర్యాటకుల కోసం వివిధ వసతులు కల్పించనున్నారు. అందులో ప్రధానంగా చిన్నపిల్లలకు ఆట పరికరాలు, మ్యూజియం, నీటి కొలను సుందరీకరణ, రెస్టారెంట్లు, మంచినీటి సౌకర్యం, కోట చారిత్రకతను తెలిపే లేజర్ షో వంటివి ఏర్పాటు చేయనున్నారు. ఖిలా దిగువ భాగంలో మంచినీటి సౌకర్యం, వాష్ రూంలు, రెస్టారెంట్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి డీపీఆర్ రూపొందించే బాధ్యతలను ఎల్అండ్‌టీ సంస్థకు కేంద్ర ప్రభుత్వం అప్పగించింది. ఇందులో భాగంగా కంపెనీ ప్రతినిధులు ఇటీవల కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి చర్చించారు.

ఆసియాలోనే రెండవ ఏక శిలా పర్వతం

ఆసియాలోనే రెండవ ఏక శిలా పర్వతం భువనగిరి కోట. 600 మీటర్ల ఎత్తున్న ఈ కోట పట్టు కోల్పోకుండా పర్వతారోహకులు శిక్షణ పొందడానికి అనువుగా ఉంది. టెంజింగ్ నార్కె అవార్డు గ్రహీత శేఖర్‌బాబు 2013 సెప్టెంబర్‌లో భువనగిరి కోట వద్ద రాక్ క్లైంబింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఐదు సంవత్సరాల నుంచి 65 ఏళ్ల వయస్సు వారికి ఇక్కడ నాలుగు విభాగాల్లో శిక్షణ ఇస్తారు. రాక్ క్లైంబింగ్(కొండను ఎక్కడం) ర్యాప్లింగ్(కొండపైనుంచితాడుతో దిగడం) జిప్‌లైన్(తీగమీద వెళ్లడం), క్యాంపింగ్ (టెంట్‌లో వసతులు ఏర్పాటు,నిద్ర వంటి) విషయాలపై శిక్షణ ఇస్తున్నారు. గ్రేడ్‌ల వారీగా శిక్షణ ఇస్తారు. ఒకరోజు, రెండు రోజులు, ఐదు రోజులు సర్టిఫికెట్ కోర్సులు, అడ్వాన్స్ శిక్షణ కూడా ఇస్తారు. రాక్ క్లైంబింగ్‌లో శిక్షణ పూర్తయిన అనంతరం హిమాలయల్లోని పర్వత సానువుల్లో శిక్షణ ఇప్పించి పర్వతారోహణకు పంపిస్తారు. ఇందుకోసం రాక్ క్లైంబింగ్ నిర్వాహకులు ఫీజు తీసుకుంటారు. రాక్ క్లైంబింగ్ కోసం ట్రైనీ ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు తదితర ప్రముఖులు సైతం వస్తుంటారు. వేసవిలో బండ వేడెక్కుతుండడంతో మార్చి నుంచి జూన్ వరకు శిక్షణ నిలిపివేస్తారు.

మతిస్థిమితం లేని మహిళ దారుణ హత్య

- బలమైన ఆయుధంతో తలపై మోదడంతో మృతిచెందినట్లు ఆనవాళ్లు
- మద్యం మత్తులోనే ఘాతుకానికి తెగబడి ఉంటారని అనుమానాలు
- హతురాలు రంగారెడ్డి జిల్లా వాసి


యాదమ్మ (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి : యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం పిలాయిపల్లిలో మతిస్థిమితంలేని మహిళ దారుణ హత్యకు గురైంది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్టు మండలం, చిన్నరావిరాల గ్రామానికి చెందిన సోమని యాదమ్మ(55) ఐదేళ్లుగా మతిస్థిమితం సరిగా లేక సమీపంలో ఉన్న గ్రామాల్లో తిరుగుతోంది. ఆమె 15రోజులుగా పిలాయిపల్లి గ్రామంలో తిరుగుతూ అడుక్కొని తింటూండేది. మంగళవారం రాత్రి గ్రామ సమీపంలోని ఓ వైన్స్ ఎదురుగా ఉన్న ఓ భవనం వెనుకాల సెల్లార్‌లో నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు ఆమె తలపై మోదారు. దాంతో తీవ్ర రక్తస్రావమై ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. బుధవారం మధ్యాహ్నం వైన్స్‌షాపులో మద్యం కొనుగోలు చేయడానికి వచ్చిన ఓ వ్యక్తి మూత్ర విసర్జనకు అటుగా వెళ్లగా వివస్త్ర స్థితిలో పడి ఉన్న ఓ మహిళా మృతదేహం కన్పించింది. వెంటనే సర్పంచ్ అందెల హరీష్‌కు తెలపడంతో ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. అలాగే క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్ పిలిపించారు. డాగ్‌స్క్వాడ్ గ్రామశివారులో రోడ్డు పక్కన ఉన్న బావి వద్దకు వచ్చి ఆగిపోయింది. తల పగిలి ఉండటంతో దేనితో హత్య చేశారని తెలియరాలేదు. సంఘటనా స్థలంలో కూడా ఎలాంటి ఆధారాలు లభించలేదు. చివరకు వైన్స్ షాప్ ఏర్పాటు చేసిన కెమెరాల్లోని సీసీ ఫుటేజీని పరిశీలించినా, అందులో ఎలాంటి అనవాళ్లు రికార్డు కాలేదు. ఎవరో మద్యం మత్తులో ఈ ఘాతుకానికి పాల్పడి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే స్థానిక ఓ పరిశ్రమలో పనిచేస్తున్న బిహార్ రాష్ట్రానికి చెందిన ఓ యువకుడిని అనుమానించి పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త లింగయ్య మాత్రం గతంలో అనారోగ్యంతో మృతిచెందాడు.

గ్యాస్ సిలిండర్ లీకై గుడిసె దగ్ధం


బాధితుడికి ఆర్థికసాయం అందజేస్తున్న డీఎస్పీ కృష్ణయ్య

మునగాల(కోదాడ): మునగాల మండలం ఆకుపాముల గ్రామంలో బుధవారం గ్యాస్ సిలిండర్ లీకై మంటలు అంటుకుని పూరిగుడిసె దగ్ధమైంది. ఆకుపాముల గ్రామానికి చెందిన గీత కార్మికుడు దొంతగాని శ్రీను భార్య రాములమ్మ తమ పూరి గుడిసెలో వంట చేస్తూ చిన్న పని నిమిత్తం బయటికి వెళ్లింది. తిరిగి వచ్చేలోపై గ్యాస్ సిలిండర్ లీకై మంటలు తాటాకు కమ్మలకు అంటుకున్నాయి. మంటలు వ్యాపించి చూస్తుండగానే గుడిసె కాలిపోయింది. ప్రమాదంలో రూ.90వేల నగదు, రెండు తులాల బంగారం, వీరి కుమారుడు నాగరాజు విద్యార్హత సర్టిఫికెట్లు, ఇతర సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి మంటలను ఆర్పారు. బాధిత కుటుంబాన్ని గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ విలాసకవి రామరాజు కుమారుడు రమేష్ రాజు రూ.10వేలు, ఇంటెలిజెన్స్ డీఎస్పీ అమరగాని కృష్ణయ్య, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లెబోయిన అంజి యాదవ్ రూ.5వేల చొప్పున ఆర్థికసాయం, కోదాడ నియోజకవర్గ బీఎస్పీ పిల్లుట్ల శ్రీనివాస్ నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు.

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

- ఒక గేటు ద్వారా నీటి విడుదల

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. దీంతో అధికారులు ప్రాజెక్టు ఒక క్రస్టు గేటును పైకెత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. బుధవారం ఎగువ నుంచి మూసీ ప్రాజెక్టుకు 150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టులో నీటిమట్టం 645 అడుగుల గరిష్టస్థాయికి చేరువలో ఉండటంతో పాటు వర్షాకాలం సీజన్ ప్రారంభ సమయం కావటంతో ప్రాజెక్టులో నీటిమట్టాన్ని తగ్గించాలని అధికారులు నిర్ణయించారు. దీంతో ప్రాజెక్టు 3వ నంబరు క్రస్టు గేటును అర అడుగు మేర పైకెత్తి ఉంచి 300 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 644.30 అడుగుల వద్ద ఉంది.

అన్నదానానికి విరాళం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలోని దీక్ష పరుల మండపంలో నిర్వహిస్తున్న అన్నదానానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అక్వా డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ రూ.1,01,116లు విరాళముగా అందజేశారు. బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి యాదాద్రీశుడిని దర్శించుకున్న వడ్డి రఘురామ్ గర్భాలయంలో స్వయంభూలను దర్శించుకున్నారు. అనంతరం ఆయనకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.







సాక్షి క్లాసిఫైడ్స్

Education

- 6 నెలల్లో 10th; ఇంటర్; డిగ్రీ; P.G; I.T.I; డిప్లమా B.Tech; D.M.L.T; M.L.T; ANM; GNM; నర్సింగ్ D.ఫార్మసీ; B.ఫార్మసీ B.A.M.S; B.H.M.S పూర్తిచేయండి. ✆ 95504 43817 [B-798938]
- One year 10th,inter,NIOS,TOSS, APOSS, Degree&PG, Year Wise Nagarjuna, SV University guidelines for B.Tech, Detained,Failed Students Cont: NICC KPHB Hyd. Ph: 9515390685, 8179882462 [H-788704]

Real Estate

FLAT FOR SALE

- Flat for sale @Nalgonda Town Ready to Occupy 2&3 bhk as per Vasthu good Ventilation, Carparking. Ph: 9030195000, 9030009059 [H-778999]

Services

LOANS

- సులభంగా లోన్ పొందండి. అతి తక్కువ వడ్డీతో, అన్ని రకాల లోన్స్, ఉద్యోగస్తులు, వ్యాపారులు, వైద్యులు (NRI) సంప్ర॥ JS ఎంటర్‌ప్రైజెస్, ఖమ్మం. భద్రాద్రి కొత్తగూడెం. 8520970781, 7842830781. [M-1221172]

BUSINESS OFFER

- ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్ పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. ఫోన్:9310515624, 8800496710. [DA-37247]

Wanted

- మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా రోజుకు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221315]
- Wanted Lab Technician's ప్రముఖ భాస్కర్ హాస్పిటల్ చిట్యాల నందు పనిచేయుటకు ల్యాబ్ టెక్నీషియన్స్ కావలెను. ఆసక్తికరమైన జీతం. సం॥ 9966541917 [Y-753144]
- అతి తక్కువ పెట్టుబడితో కంపెనీ నుండి పంపించే పాత రికార్డ్స్ చూసి కొత్త రికార్డ్స్ వ్రాసినందుకు వారంవారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ చేయండి. 8465843194 [G-813]
- Wanted Qualified Maths Teacher in well Reputed School Near Hyderabad. Salary : Negotiable Cell : 9848786993 [Y-784264]
- షిర్డిసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్, ఆయాలు, భార్యా-భర్తలు, డ్రైవర్స్,సాయి మందిరములో పూజారి కావలెను. ఫోన్ : 9391036931, 9246585901. [HA-11235]
- లేపాక్షి హెల్త్ కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ:18k. ఏజెంట్ కమీషన్ 6k. ఫోన్: 9640400073 [HA-284]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.





